క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు మైనార్టీ విద్యార్థి



ముబీన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి షేక్ ముబీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హన్మకొండ జిల్లా కేంద్రంలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న ముబీన్ డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో స్వర్ణ పతకాలను సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ముజీబ్ ఆడనున్నాడు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సైదులు, ఆర్ఎల్‌సీ ఖమ్మం ఎంజె అరుణకుమారి, విజిలెన్స్ అధికారులు సీతారాములు, జమీల్ పాషా తదితరులు ముబీన్, పీఈటీ హరీష్‌ను అభినందించారు.

టీపీజేఎల్ఏ నూతన కమిటీ ఎన్నిక

సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ సత్తుపల్లి మండల నూతన కమిటీని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్సా రమేష్‌గౌడ్ మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎం.వాసు, ఉపాధ్యక్షుడిగా దూదిపాల ప్రభుకుమార్, ప్రధాన కార్యదర్శిగా పడిగల రాఘవరావు, సహాయ కార్యదర్శి డి.రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా చవల ప్రభాకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనంత్, గౌరవ అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌కె.వలీ, గౌరవ సలహాదారులుగా డి.వెంకట్రావ్, కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులుగా ఎస్‌కె ముస్తాఫా, డి.ముఖర్జీ, కె.సుధీర్, జి.వంశీ, కె.స్వామి, ఆర్.శ్రీనివాసరావు, బి.కోటేశ్వరరావులను నియమించినట్లు తెలిపారు.

ధాన్యానికి బోనస్ చెల్లించాలి

సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారం స్వీకరించగానే రైతుభరోసా అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు కావటం లేదని, వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి వారంరోజులు అవుతున్నా రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ కాలేదని విమర్శించారు. ఖరీఫ్‌లో దిగుబడి అయిన ధాన్యం అమ్మిన రైతులకు బోనస్‌తో పాటు వెంటనే రైతు భరోసా విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

విద్యావలంటీర్లకు గౌరవ వేతనం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న విద్యావలంటీర్లకు మంగళవారం దాతలు గౌరవ వేతనం చెల్లించారు. పాఠశాలలో గణితం బోధిస్తున్న విద్యా వలంటీర్ ప్రియాంకకు కూరపాటి సత్యనారాయణ రాజు నెలకు పది వేల రూపాయలు చొప్పున ఐదు నెలల పాటు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మొదటి నెల వేతనం రూ.10,000 అందజేశారు. అలాగే హిందీ బోధిస్తున్న రజియా బేగంకు నెలకు రూ.5 వేలు చొప్పున ఐదు నెలలు చెల్లిస్తానని కుర్నవల్లి సర్పంచ్ ఐలూరి లక్ష్మీ చెల్లించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో శ్రమదానం

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండడంతో వైద్యసిబ్బంది కలిసి పారిశుద్ధ్యం చేపట్టారు. ఈ మేరకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ దుర్గామల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లా రంగయ్య సేవలు మరువలేనివి

తల్లాడ: మాజీ ఎంపీపీ చల్లా రంగయ్య సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్‌రావు అన్నారు. తల్లాడలో మంగళవారం రంగయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం సత్తుపల్లి ఇన్‌చార్జ్ మాచర్ల భారతి, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాతా భాస్కర్‌రావు, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వర్‌రావు, గుంటుపల్లి వెంకటయ్య, తమ్మిశెట్టి శ్రీనువాసరావు, సైదులు ఉన్నారు. అదేవిధంగా రంగయ్య మృతిపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సంతాపం తెలిపారు.





మండలకేంద్రంలో ఉన్న మద్యం దుకాణాలు

అయినా.. చోటు మారలేదు!

కొత్త టెండర్లు వచ్చినా వైన్స్‌ల స్థలం మార్చని వైనం

- ఇళ్ల మధ్య వద్దంటూ గగ్గోలు పెడుతున్న ప్రజలు
- ఊరి చివరికి తరలించాలని వేడుకోలు

ముదిగొండ: మండలంలో నూతన మద్యం టెండర్లలో దక్కించుకున్న షాపులను మార్చకుండా అదే స్థలంలో ఉంచడంపై స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో ప్రభుత్వం ప్రకటించిన నాలుగు మద్యం లైసెన్స్ షాపుల్లో ముదిగొండకు మూడు, వల్లభికి ఒకటి వచ్చాయి. వల్లభి ఒక్కటి మాత్రమే గ్రామానికి చివరిలో ఉంది. కానీ ముదిగొండలో ఉన్న మూడు దుకాణాలు ఒకే చోట ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్నాయి.

పాఠశాల, కళాశాలలకు సమీపంలోనే..

ఇప్పుడున్న ఆ రెండు వైన్సులు మసీదు, పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమీపంలో ఉన్నాయి. అదే స్థలాల్లో ఉంచి ప్రారంభించి నడపడంతో ఇళ్ల మధ్యన ఉండే ప్రజలు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం పాఠశాలకు, కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు వాటి మధ్యన వెళ్తున్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో పలు ద్విచక్ర వాహనాలు, మద్యం ప్రియులతో కిక్కిరిసిపోతున్నారు. కొంత రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని వాపోతున్నారు. గతంలోనే వీటిపై పలు ఆందోళనలు, అధికారులకు వినతిపత్రాలు, ధర్నాలు నిర్వహించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైన్సులను అక్కడి నుంచి ఊరి చివరికి తరలించాలని కోరుతున్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున షాపుల ముందు ఆందోళన చేపడతామని చెబుతున్నారు.

పంచాయతీ అనుమతులు లేవు..



మద్యం లైసెన్స్ దుకాణాలకు సంబంధించి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. గత రెండేళ్ల నుంచి వ్యాపార పన్ను కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఒక్కో షాపునకు ఏడాదికి రూ 2వేలు చెల్లించాలని చెప్పాం కాని చెల్లించలేదు. మూడు దుకాణాలకు రెండేళ్లకు రూ 12వేలు చెల్లించకుండానే వదిలేయడం గమనార్హం.

– సంపత్, ముదిగొండ పంచాయతీ కార్యదర్శి

రెండేళ్ల నుంచి ఇబ్బంది..



ఇళ్ల పరిసర ప్రాంతాల మధ్యన వైన్స్‌లు ఉంచడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. దుకాణాలకు ఎదురుగా చిరు వ్యాపారులు, వాహనాలు, మందు తాగేందుకు వచ్చేవాళ్లతో రాకపోకలకు అంతరాయంగా ఉంది. పలు మార్లు అధికారులకు విన్నవించినా మళ్లీ ఇక్కడే కొత్త దుకాణాలు మొదలయ్యాయి. ఈ సారి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– వేల్పుల లక్ష్మణ్, ముదిగొండ

యజమానులు ఎక్కడ కావాలంటే అక్కడే ఇస్తారు..

మద్యం లైసెన్స్ షాపులు దక్కించుకున్న వారు ఎక్కడ కావాలని కోరారో అక్కడి ఇస్తారు. కాకపోతే బడికి, గుడికి దగ్గరలో ఉండకూడదు. ఇప్పటికే ముదిగొండలో ఉన్న మూడు దుకాణాలకు గాను రెండు మరో ప్రాంతానికి మార్చాలని దుకాణాదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కటి అక్కడే ఉంటుందని, మరొకటి వల్లభిలో కూడా అక్కడే ఉంటుంది.

– కుమ్మరి పోశెట్టి, నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ

సత్యంపేట సమస్యలు పరిష్కరిస్తాం..

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లి: ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

సత్తుపల్లి: పోలింగ్ రోజు ఓటు వేయబోమని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు గళం ఎత్తినప్పుడు ఆవేదన తనకు అర్థమైందని, అందుకే గెలిచిన తొమ్మిది రోజుల్లోనే సత్యంపేటకు సమస్యల పరిష్కారంపై అధికారుల సాక్షిగా మాట ఇస్తున్నానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయతీ పరిధి సత్యంపేటకు మంగళవారం ఆమె మట్టా దయానంద్‌తో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు సమస్యలు చెప్పుకునేందుకు ఎప్పుడైనా రావొచ్చని, ఫోన్‌లోనైనా తెలపొచ్చని పేర్కొన్నారు. పదిహేనేళ్లుగా ఈ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, తాగునీరు, సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనం, విద్యుత్‌లైన్లు, పోడు పట్టాలు, బాసారం–సత్యంపేట గుడిరోడ్డు, సింగరేణి బ్లాస్టింగ్ తదితర సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. సత్యంపేట గ్రామం రెవెన్యూ పరిధిలో లేకపోవటం గత ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రాక్షపల్లి సర్పంచ్ పూచి చిలకమ్మ, ఎంపీటీసీ హలావత్ నాగజ్యోతి, శివవేణు, ఒగ్గు భూపతిరెడ్డి, భరత్, హళావత్ వెంకటేశ్వరరావు, దామోదర్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం..

వేంసూరు: తుపాన్ కారణంగా పంట నష్టం వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్లి రైతులకు అండగా నిలుస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి తుపాన్‌కు దెబ్బతిన్న పంటలు పరిశీలించి, జయలక్ష్మీ పురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకులు డాక్టర్ మట్టా దయనంద్ విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవరెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్‌రావు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, గొర్ల వెంకటప్పరెడ్డి, నరసింహారావు, కనమతరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పుల్లారావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కోటమర్తి సురేష్, నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా: ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

వైరా: ఎన్నికలలో తనకు సహకరించి తన గెలుపునకు కృషి చేసిన సీపీఐ, టీడీపీ, వైఎస్సార్‌టీపీ కార్యకర్తలకు సమస్యల పరిష్కారంలో అండగా ఉంటానని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం వైరాలోని సీపీఐ, టీడీపీ కార్యాలయాలను ఆయన సందర్శించి తనకు ఓట్లు వేసి గెలిపించడానికి కృషి చేసినందుకు గాను ఆయా పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయా పార్టీల నాయకులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, యర్రా బాబు, యామాల గోపాలరావు, జి.అశోక్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, మండల కన్వీనర్ సురేందర్, అయ్యప్ప చౌదరి, పూర్ణ, దాసరి దానియేలు, కట్ల సంతోష్, ఏదునూరి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

కోట మైసమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కారేపల్లి: ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోటమైసమ్మతల్లి అమ్మవారిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంగళశారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పోడు రైతులు ఎమ్మెల్యేను కలిసి పోడు పట్టాలపై బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని తెలపడంతో బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణాలు అందించేలా కృషి చేయాలన్నారు. భాగ్యనగర్ గ్రామానికి చెందిన బానోత్ శ్రీకాంత్ అనే దివ్యాంగుడు తనకు ట్రైకార్‌లోన్ ఇప్పించి తన కుటుంబానికి అండగా నిలవాలని కోరడంతో ఎంపీడీఓతో ఫోన్‌లో మాట్లాడి దరఖాస్తును పరిశీలించి న్యాయం చేయాలన్నారు. పగడాల మంజుల, మండలాధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్, దేవస్థానం చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, మేదరి వీరప్రతాప్, తోటకూరి రాంబాబు, గుండ్ల జగన్నాథం, గుడిపూడి తిరుమలరావు, సుధాకర్, వెంకటేశ్వర్లు, గన్యా, రాంబాబు, భద్రునాయక్ పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కారేపల్లి: మిరప తోటను పరిశీలిస్తున్న అధికారులు

కారేపల్లి: రైతులు మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని పోలంపల్లి గ్రామంలో మిరప తోటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తుఫాన్ కారణంగా నేలకొరిగిన మిరప చెట్లు నేలకు తాకడంతో కాయలు దెబ్బతినే అవకాశం ఉందని, భూమిని తాకకుండా మొక్కలను నిలబెట్టి ఊతం ఇవ్వాలన్నారు. తేమ శాతం కారణంగా కొమ్మ, కాయ కుల్లుడు వచ్చే అవకాశం ఉందని మైందుస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఏఈఓ ప్రమీల, రైతులు పాల్గొన్నారు.



ముదిగొండ: ఏఈఓల సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాధ

ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలి

ముదిగొండ: రబీలో ఆరుతడి పంటలు సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ రాధ సూచించారు. ముదిగొండలోని రైతువేదికలో మంగళవారం ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. రైతుబంధు రాని రైతులకు అవగాహన కల్పించి, ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక, శశీ, లిఖిత పాల్గొన్నారు.

అయ్యప్ప ఇరుముడి



అయ్యప్ప మాలధారులు

ముదిగొండ: ముదిగొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారులు ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కోణందుల రాధాకృష్ణస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు మంగళవారం స్టడీ విజిట్‌లో భాగంగా కల్లూరులోని కాకతీయ సిమెంట్స్ అండ్ షుగర్ ఇండస్ట్రీని సందర్శించారు. చక్కెర ఉత్పత్తిలోని దశలు, క్రషింగ్, జ్యూసింగ్, స్ఫటికీకరణ, బ్యాంకింగ్ వంటి వివిధ దశలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



షుగర్ ఫ్యాక్టరీలో విద్యార్థులు

వనసమారాధనలో విద్యార్థులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

కొణిజర్ల: మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సమీపంలోని ఓ మామిడి తోటలో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ కరామత్ అలీ, సహ ఉపాధ్యాయుడు జయరాజు, ఎస్ఎంసీ చైర్మన్ రవిచందర్, ఉపసర్పంచ్ సోందుమియా, సీఆర్పీలు పవన్, సైదుబాబు, నాగరాజు, రమేష్, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి లాలాయ్య, అంగన్‌వాడీ టీచర్ సువార్త, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కూనంనేనిని సత్కరించిన నాయకులు



సాంబశివరావును సన్మానిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారి ఖమ్మం వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును సత్తుపల్లి సీపీఐ నాయకులు మంగళవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దండి ఆదినారాయణ, తాటి వీరభద్రం, రాజు, వెంకటేశ్వర్లు, కుమారి, రాజమ్మ, తాటి రాజులు, తిరుపతమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గీతాకుమారికి పురస్కారం



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన కవయిత్రి, విశ్రాంత ఉపాధ్యాయురాలు బత్తిన గీతాకుమారికి పెద్దపల్లికి చెందిన మేఘనా సాహితీ కళావేదిక వారు మధుర కవి విభూషణ పురస్కారాన్ని మంగళవారం అందించారు. ఈర్ల సమ్మయ్య రూపొందించిన నూతన తెలుగు కవితా ప్రక్రియ మధురిమలు 500లకు పైగా కవితలు రాసినందుకు గాను పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందనలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వైరా: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తాటిపూడి, గన్నవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పలువురిని పరామర్శిస్తారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని తెలిపారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



తల్లాడ: శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్లూరు: కార్తీక మాసం చివరిరోజును పురస్కరించుకుని కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం (శివాలయం)లో మంగళవారం ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు 108 కేజీల బియ్యంతో అన్నం వండి శివునికి అభిషేకించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పసుమర్తి చందర్‌రావు, పెద్దబోయిన నారాయణరావు, ఏనుగు సత్యంబాబు, బుర్రి వీరయ్య, కాకిత ఫణి పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

తల్లాడ: తల్లాడలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. మంగళవారం అభిషేక పూజలు జరిగాయి. అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణాల నడుమ స్వామి వారి కల్యాణం నిర్వహించారు.



కల్లూరు: అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి



మధిరరూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న ఆశా కార్యకర్తలు



ఎర్రుపాలెం: ఆశా కార్యకర్తల సమావేశం

మధిరరూరల్: ప్రజలకు వ్యాధుల నివారణకు ఉచితంగా మందులు అందజేయాలని, వారి జీవన శైలి, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి వీరబాబు కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆశకార్యకర్తలు, సిబ్బంది సమన్వయంతో మాటూరు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు ప్రతీ గృహాన్ని సందర్శించి డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగర్, ఇతరత్రా అసంక్రమణ వ్యాధులపై ఆశ కార్యకర్తలు తగిన అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి పుష్పలత సూచించారు. మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ...30 సంవత్సరాలు పైబడిన వారందరికీ బీపీ, షుగర్, కాన్సర్ పరీక్షలు నిర్వహించి, ఈవ్యాధులున్న వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శశిపూర్ణ, వెంకట్‌లాల్, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్ఎన్ రాణి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు అశోక్, సాయిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, ఏఎన్ఎంలు, తదితరులున్నారు.

తల్లాడ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లె దవాఖానా వైద్యులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెలోనే..

- సమ్మెలోకి దిగిన పోస్టల్ సిబ్బంది



వైరా: నినాదాలు చేస్తున్న పోస్టల్ సిబ్బంది

వైరా: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెలోనే ఉంటామని పోస్టల్ సిబ్బంది మంగళవారం స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఏఐజీడీఎస్‌యూ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు మద్దతుగా మండలంలోని 25 బ్రాంచి కార్యాలయాలను మూసి వేసి పోస్టు మాస్టర్లు సమ్మె బాటపట్టారు. ఈ కార్యక్రమంలో బండి జయరాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మహమ్మద్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: గ్రామీణ డాక్ సేవక్‌లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని కల్పించాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సత్తుపల్లి పోస్టాఫీస్ ఎదుట డివిజన్‌లోని తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఏఐజీడీఎస్‌యూ బ్రాంచ్ కార్యదర్శి బి.కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు, వి.మహేష్, మౌనిక, రమ్య, ఎన్‌యుజీడీఎస్ బ్రాంచ్ సెక్రటరీ, బి.నర్సింహారావు, ఎస్‌డి జానీ, పాషా, ఐ.వెంకటేశ్వరరావు, సంజీవరావు, కోటమర్తి వెంకటేశ్వరరావు, ఖాజాబి పాల్గొన్నారు.

కల్లూరు: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోస్టల్ ఉద్యోగులైన జీడీఎస్, బీపీఎంలు, ఏబీపీఎంలు, డాక్‌సేవకులు మంగళవారం నుంచి కల్లూరు సబ్ పోస్టాఫీసు ఎదుట సమ్మెకు దిగారు. మండలంలో 21 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉండగా 18 కార్యాలయాలకు తాళాలు వేసి ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఉపాధ్యాయుల రమేష్, సత్తుపల్లి ప్రచార కార్యదర్శి దేవరపల్లి వెంకటేష్‌లు మాట్లాడుతూ... తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.



సత్తుపల్లిటౌన్: సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు



కల్లూరులో..